# పీహెచ్‌డీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు 1 నుంచి

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: పీహెచ్‌డీలో ప్రవేశాల కోసం తుది ఇంటర్వ్యూలు డిసెంబరు 1వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు జేఎన్‌టీయూ ప్రవేశాల విభాగం డైరెక్టర్ డాక్టర్ బి.బాలునాయక్ తెలిపారు. 8వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. రోజూ ఉదయం 9గంటల నుంచి వర్సిటీ ప్రవేశాల విభాగంలో ఇంటర్వ్యూలు మొదలవుతాయన్నారు. మొదటిరోజు సివిల్ ఇంజినీరింగ్ విభాగం అభ్యర్థులతో ఇంటర్వ్యూలు మొదలై.. చివరిరోజు కంప్యూటర్ సైన్స్ విభాగం అభ్యర్థుల ఎంపికతో ఇంటర్వ్యూలు ముగుస్తాయన్నారు. డిసెంబరు 7న (ఆదివారం) ఎటువంటి ఇంటర్వ్యూలు ఉండవన్నారు. ఇటీవల ధ్రువపత్రాల పరిశీలనకు 610మంది హాజరుకాగా.. ఇందులో ఇంకా 200కు పైగా అభ్యర్థులు వివిధ పత్రాలు సమర్పించాల్సి ఉండడంతో వారిని హోల్డ్‌లో పెట్టారు. తుది ఇంటర్వ్యూల సమయానికి అన్ని పత్రాలు పక్కాగా సమర్పించాల్సి ఉంటుందని బాలునాయక్ చెప్పారు.

# హైదరాబాద్‌లో నాటింగ్‌హోమ్ వర్సిటీ ఆఫ్ క్యాంపస్!

**» ఆసక్తి కనబరిచిన వర్సిటీ ప్రతినిధులు**

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన నాటింగ్‌హోమ్ విశ్వవిద్యాలయం భారత్‌లో తన ఆఫ్ క్యాంపస్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పేందుకు ఆసక్తి చూపించింది. అనేక అనుకూలతలున్న హైదరాబాదే వర్సిటీ ఆఫ్ క్యాంపస్ ఏర్పాటుకు అత్యుత్తమ ఎంపిక అవుతుందని వర్సిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ ప్రైవేటు వర్సిటీకి యూకేలోని ప్రధాన క్యాంపస్‌లో 35 వేల విద్యార్థులుండగా, చైనాలోని ఆఫ్ క్యాంపస్‌లో 10 వేలు, మలేషియాలో 5 వేల మంది విద్యార్థులున్నారు. త్వరలో భారత్‌లోనూ ఆఫ్ క్యాంపస్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని వర్సిటీ ప్రతినిధులు తెలిపారు. సోమవారం వారు ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డిని ఆయన కార్యాలయంలో కలిశారు. ఉన్నత విద్యామండలితో కలిసి సంయుక్త కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని వర్సిటీ అంతర్జాతీయ వ్యవహారాలు ఇన్‌చార్జి ఆండియా ఎలాన్స్ తెలిపారు. ఉన్నత విద్యామండలిలో అనేక సంస్కరణలు చేపడుతున్నామని... రాష్ట్రంలో ఆఫ్ క్యాంపస్ ఏర్పాటు చేస్తే ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని బాలకిష్టారెడ్డి చెప్పారు.

# తదుపరి కార్యాచరణ సిద్ధం చేయండి: వీసీ

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: అలుమ్ని సమావేశం విజయవంతమైన నేపథ్యంలో తదుపరి కార్యాచరణ సిద్ధం చేయాలని జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. స్టార్టప్‌లు, పరిశోధనలకు ప్రోత్సాహం, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు తదితరాలతో పాటు అన్ని విభాగాల్లో చేపట్టాల్సిన వివిధ అంశాలపై అలుమ్ని ప్రతినిధులకు స్పష్టమైన వివరాలు ఇచ్చిన నేపథ్యంలో వారితో ఎప్పటికప్పుడు మాట్లాడాల్సిన అవసరాన్ని సూచించారు. ఎవరెవరు ఎలాంటి సహకారం అందిస్తారన్నదానిపై నివేదిక తయారుచేయాలన్నారు. తదనుగుణంగా వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తిచేయాలన్నారు. పూర్వ విద్యార్థులను ఒక్కచోటకు తీసుకురావడం ఒక ఎత్తయితే.. వారిచ్చిన హామీలన్నింటిని నెరవేరేలా చర్యలు తీసుకోవడం మరింత ముఖ్యమన్నారు. రెండురోజుల వేడుకలు ఘనంగా జరగడంపై నిర్వాహకులను వీసీ అభినందించారు. అలాగే డిసెంబర్ 8, 9వ తేదీల్లో ఫ్యూచర్ సిటీలో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు వర్సిటీ నుంచి ఇవ్వాల్సిన సలహాలు, సూచనలపై అధికారుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. రెక్టార్ డాక్టర్ కె.విజయ్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి.నరసింహారెడ్డి, అలుమ్ని డైరెక్టర్ డాక్టర్ పి.భ్రమర తదితరులు పాల్గొన్నారు.